క్లుప్తంగా

అర్ధవీడు మాజీ సర్పంచ్ మృతి


మృతి చెందిన మాజీ సర్పంచ్ రాంరెడ్డి

అర్ధవీడు(బేస్తవారిపేట): అర్ధవీడు మాజీ సర్పంచ్ మునగాల రాంరెడ్డి(89) గురువారం అర్ధవీడులోని స్వగృహంలో మృతి చెందారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో పేదలకు సహాయం చేసి, మంచికి మారుపేరుగా నిలిచారని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు.

అనుమతి లేని కట్టడాలు నిలిపివేత


అక్రమ కట్టడాన్ని నిలిపివేస్తున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పాములపల్లె రోడ్డులో అనధికారికంగా నిర్మిస్తున్న భవనాన్ని కమిషనర్ డి.వెంకటదాసు గురువారం అడ్డుకున్నారు. నగర పంచాయతీలో టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అనుమతి తీసుకున్నాకే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనుమతులు లేకుండా నిర్మిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కోటగడ్డ వీధిలో సచివాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించేలా సిబ్బంది పనిచేయాలని సూచించారు.

రేపు సుకృతానందాజీ స్వామి రాక

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీరామక్రిష్ణ ధ్యానమందిరం, మండలంలోని వెల్లుపల్లె గ్రామంలో రామక్రిష్ణ ధ్యానమందిరాలను ఈ నెల 14న తిరుపతిలోని రామకృష్ణ మఠం స్వామి సుకృతానందాజీ మహారాజ్ సందర్శించనున్నట్లు మందిర నిర్వాహకులు పి.హనుమంతారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక ఆనందం పొందాలని కోరారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ


నుజ్జునుజ్జయిన సిమెంట్ లారీ ముందు భాగం

బేస్తవారిపేట: మండలంలోని పందిళ్లపల్లె సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవే రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టిన సంఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కొమరోలు వైపు వెళ్తున్న ఖాళీ లారీని డ్రైవర్ టాయిలెట్‌కు వెళ్లేందుకు రోడ్డు మార్జిన్‌లో నిలిపాడు. అదే సమయంలో సిమెంట్ బస్తాల లోడుతో తాడిపత్రి వెళ్తున్న లారీ ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొట్టింది. సిమెంట్ లోడ్ లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న పిచ్చయ్య యాదవ్, ఉపాధ్యాయులు

గిద్దలూరు రూరల్: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు యశ్వంత్ ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు మొర్రి పిచ్చయ్యయాదవ్ తన సొంత నిధులతో గురువారం పంపిణీ చేశారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పోటీ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌తో పాటు ఫీజును పిచ్చయ్యయాదవ్ చెల్లించడం అభినందనీయమని ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మమ్మ, జనార్దన్‌రెడ్డి, బాలసుందరం, ప్రమీలనారిశ్రీ, పీరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎం నేత సీతారామ్‌కు ఘన నివాళి

మార్కాపురం: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి గురువారం రాత్రి స్థానిక పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. పార్టీ నాయకులు రఫీ మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతం కోసం సీపీఎంలో చేరిన ఏచూరి తుది శ్వాస వరకూ అదే పార్టీలో కొనసాగారని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన సీతారాం ఆశయాల కోసం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.బాలనాగయ్య, జవ్వాజి రాజు, ఏపీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షులు ఎన్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

గణపతి బప్పా మోరియా


కమ్మవారిపాలెంలో సందడి చేస్తున్న బూచేపల్లి అభిమానులు


వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం వినాయక నిమజ్జన కార్యక్రమాలు కోలాహలంగా నిర్వహించారు. మండలంలోని పులిపాడు, బసవాపురం, కెల్లంపల్లి, ఉల్లగల్లు, రాజగోపాలరెడ్డినగర్, కమ్మవారిపాలెం పూరిమెట్ల, ఉమామహేశ్వరపురం, పెదరావిపాడు, తమ్మలూరు, పోలవరం గ్రామాల్లో ఆరో రోజు నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. కమ్మవారిపాలెం, పూరిమెట్ల గ్రామాల్లో బూచేపల్లి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ, బూచేపల్లి అభిమానులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. యువతీ యువకులు కోలాహలంగా గులాములు చల్లుకుంటూ జై గణేశా... జైజై గణేశా నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.


గ్రామోత్సవంలో పాత పోలీసుస్టేషను వద్ద గణపయ్య

వినాయకుడికి ఎమ్మెల్యే తాటిపర్తి ప్రత్యేక పూజలు

యర్రగొండపాలెం: స్థానిక కొలుకుల సెంటర్‌లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన సిద్ధి వినాయక స్వామికి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా జరిగే వినాయకుడికి కల్యాణం సందర్భంగా ఏర్పాటు చేసే అన్నదాన ఖర్చులను తాను బరాయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు బిజ్జం రమణారెడ్డి, పి.నందిరెడ్డి, వై.భాగ్యారావు, ఆతుకూరి కిష్టయ్య, వి.సాయిరెడ్డి, పి.ప్రసాద్ ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయా కార్యాక్రమాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సూరె ప్రసాద్, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, చిలకల అంకిరెడ్డి, రోషిరెడ్డి, సూరె శ్రీనివాసులు, పబ్బిశెట్టి శ్రీనివాసులు, కందుల నాగార్జునరెడ్డి, ఒంగోలు సుబ్బారెడ్డి, మెడబలిమి రాజశేఖర్, సింగా ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా వినాయకుని నిమజ్జనం


పూరిమెట్లలో..

కురిచేడు: గణేశ్ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన ఆదిదేవునికి ఇప్పటి వరకు ఘనంగా పూజలు నిర్వహించిన భక్తులు వైభవంగా నిమజ్జనం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో స్వామివారి విగ్రహాలను ఉంచి విద్యుద్దీపాలతో అలంకరించి డీజేలతో పాటు మ్యూజికల్ వాయిద్యాలతో గ్రామోత్సవాలు వైభవంగా నిర్వహించి నిమజ్జనం చేపట్టారు. యువకులు పోటీలు పడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించి ఆనందిస్తున్నారు.

వ్యవసాయంలో ఆధునిక మెళకువలు తెలుసుకోవాలి

● ఏడీఏ బాలాజీనాయక్


రైతులకు సూచనలు చేస్తున్న సైంటిస్ట్ వరప్రసాద్

దర్శి: దళిత గిరిజన రైతులు, కౌలు రైతులు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ రుణాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయంలో ఆదునిక పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు వచ్చే విధంగా కృషి చేయాలని దర్శి సహాయ సంచాలకులు ఆర్.బాలాజీనాయక్ తెలిపారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు, ప్రభుత్వ అధికారులకు ముఖాముఖి సదస్సు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు డాక్టర్ సీహెచ్ వరప్రసాద్ మాట్లాడుతూ రైతులు యాజమాన్య పద్ధతి ద్వారా నూతన వంగడాలను ఉత్పత్తి చేసుకుని ఆధునిక పద్ధతుల ద్వారా క్షేత్రస్థాయిలో పంటల మొక్క దిగుబడుల గురించి తెలుసుకొని వ్యవసాయం చేయాలని ఆయన రైతులకు పిలుపునిచ్చారు. వ్యవసాయంతో పాటు పాడి ఉత్పత్తి రంగంలో ఎస్సీ,ఎస్టీ రైతులు పాలదిగుబడి శాతాన్ని పెంచుకొని ఆర్థికపురోభివృద్ధి వైపు పయనించాలని, అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన మినీ గోకులాలను ప్రతి ఒక్క పాడిపోషకులు వినియోగించుకోవాలని ప్రాంతీయ పశువైద్యాధికారి పురుషోత్తమరాజు తెలిపారు. దళితబహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఎం.హేమలత మాట్లాడుతూ మహిళా రైతులకు వారికి భూమితో పాటు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ప్రభుత్వ పరంగా అనేక సంక్షేమ పథకాలు పొందుపరిచినందున ఎస్సీ,ఎస్టీ మహిళలు ప్రకృతి వ్యవసాయంలో మార్పు తెచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. గ్రామస్థాయిలో కౌలు రైతులు ప్రతి ఒక్కరూ పంట సాగు ధృవీకరణ పత్రాలు పొంది వ్యవసాయంలో పెట్టుబడుల కోసం బ్యాంకు రుణాలు ఇప్పించుటకు వ్యవసాయ శాఖ కృషి చేస్తోందని మండల వ్యవసాయాధికారి బాలకృష్ణనాయక్ తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీ కింద ఉద్యానపంటలు ఎక్కువగా ఉన్నందున ఎస్సీ,ఎస్టీ రైతులు వారి పొలాల్లో ఉద్యానవన పంటలు సాగు చేసుకుని రాయితీ పొందాలని, పశుపోషకుల కోసం గ్రామస్థాయిలో ప్రతి పశుపోషకులకు మినీ గోకులం ఏర్పాటు చేస్తుందన్న విషయం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఎన్‌ఆర్ ఈజీఎస్ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్. తిరుపతిరావు, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కో ఆర్డినేటర్ గుంటూరు నాగమణి, ఒంగోలు సిటీ కో ఆర్డినేటర్ గుత్తి కోటేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ రైతులు పాల్గొన్నారు.

రామాపురం–లక్ష్మీపురం రోడ్డులో కుంగిన కల్వర్టు


గుంతలమయమైన కల్వర్టు

దొనకొండ: మండలంలోని రామాపురం–లక్ష్మీపురం గ్రామాలను కలుపుతూ మార్కాపురం వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు చిల్లచెట్లతో నిండిపోయింది. రామాపురం, లక్ష్మీపురం చెరువు కట్ట వద్ద గతంలో నిర్మించిన కల్వర్టు కుంగిపోయింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, స్కూల్ బస్సులు ప్రతి నిత్యం ఈ రహదారి నుంచి ఉదయం, సాయంత్రం తిరుగుతుంటాయి. కల్వర్టు కుంగి పోవటంతో భయంకరమైన గుంత ఏర్పడి ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యాయి. అధికారులు ఆ దారి నుంచి వెళ్తుంటారు.. వస్తుంటారు. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వర్షం పడిన సమయంలో కల్వర్టు కుంగిన ప్రదేశంలో నీరు నిలబడి ప్రమాదాలకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులు కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

మార్కాపురం: విజయవాడ వరద బాధితులకు మార్కాపురం పట్టణానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు ఎస్‌వీఎల్ ఆధ్వర్యంలో 1,12,216 రూపాయలు సేకరించి విజయవాడలోని అక్షయపాత్ర ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌వీఎల్ మాట్లాడుతూ మార్కాపురం పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సంస్థ, ఆవోపా(ఆర్యవైశ్య ప్రొఫెషనల్ అండ్ అఫీషియల్స్), రిలాక్స్ గ్రూప్, మార్కాపురం ఆఫీషియల్స్ గ్రూప్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి వరద బాధితులకు తమవంతు బాధ్యతగా అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రతాప్, సీహెచ్ సుబ్బారావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: విజయవాడ వరద బాధితులకు అందించేందుకు సీపీఐ మార్కాపురం శాఖ రూ.25 వేల రూపాయలు విరాళం సేకరించినట్లు నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య గురువారం తెలిపారు. ప్రజాసమస్యలపై పోరాటం చేస్తూనే మరోవైపు తమ పార్టీ విపత్తు సమయంలో సేవా కార్యక్రమాల్లో ముందుటుందని పేర్కొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం


శ్రీనివాస మహోత్సవ కల్యాణంలో పాల్గొన్న భక్తులు

యర్రగొండపాలెం: ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కొలుకుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన సిద్ధి వినాయక స్వామి నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. త్రిదండి చిన్న జీయర్ స్వామి ఆశీస్సులతో మార్కాపురం శ్రీకృష్ణ స్వరాంజలి గోష్టి గురువు పాదర్తి లక్ష్మీమల్లిక శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులు కంకణాలు ధరించి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు కుంకుమ పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

దశదిన కర్మకు హాజరైన మాజీ ఎమ్మెల్యే అన్నా

పొదిలి రూరల్: పొదిలి మండలం మాదాలవారిపాలెం మాజీ సర్పంచ్ మీగడ చంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి స్వగ్రామంలో గురువారం నిర్వహించిన దశదినకర్మకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు హాజరయ్యారు, చంద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షుడు అనికాళ్ల ఈశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గుంటూరి నాగిరెడ్డి, పిచ్చిరెడ్డి, చిన్న నారాయణరెడ్డి, పులిగొర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

15 వరకు డిగ్రీ మూడో ఫేజ్ ప్రవేశాల కౌన్సిలింగ్

దొనకొండ: స్థానిక గౌతమీ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15వ తేదీ వరకు డిగ్రీ మూడో ఫేజ్ ప్రవేశాలు జరుగుతాయని కళాశాల అడ్మిన్ నాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి కళాశాలలో బీఏ హిస్టరీ, బీఏ ఎకనామిక్స్, బీకామ్ కంప్యూటర్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసువాలని నాని కోరారు.

విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

పుల్లలచెరువు: వరద బాధితులకు అండగా సీపీఐ ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి గురునాథం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి. శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు విరాళాల సేకరణ కార్యక్రమంలో నియోజకవర్గంలో రెండు రోజుల పాటు విరాళాలు సేకరిస్తామని, ప్రజలు, వ్యాపార సంస్థలు, ఉద్యోగులు వారి శక్తి మేరకు సాయం చేయాలని కోరారు. సీపీఐ త్రిపురాంతకం కార్యదర్శి బి.రామయ్య పాల్గొన్నారు.

జగనన్న కాలనీని పరిశీలించిన హౌసింగ్ ఈఈ


హౌసింగ్ కాలనీ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఈఈ, ఎంపీడీఓ

త్రిపురాంతకం: జగనన్న గృహ సముదాయంలో నిర్మాణంలో ఉన్న పక్కా గృహాలను ఈఈ దాశరథశర్మ పరిశీలించి లబ్ధిదారులకు తగిన సూచనలు చేశారు. త్రిపురాంతకం జగనన్న కాలనీలో ఆప్షన్ 3 కింద కాంట్రాక్టర్ ద్వారా నిర్మాణం జరుగుతున్న గృహ నిర్మాణాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ నిర్మాణాలను నాణ్యంగా నిర్మించాలని సూచించారు. అదే విధంగా నీటితో బాగా క్యూరింగ్ చేయాలన్నారు. నిర్మాణ పనులు జరిగే సమయంలో లబ్ధిదారులు అందుబాటులో ఉండి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు 90 రోజులు పనిదినాలు త్వరితగతిన కల్పించాలని ఎంపీడీఓ వరప్రసాద్, ఏపీఓ సుజాతలను ఆదేశించారు. ఈయన వెంట హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉదయశ్రీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరసింహారెడ్డి ఉన్నారు.

తక్కువ ఖరీదు ఆహార పదార్థాల్లో ఎక్కువ పోషకాలు


పిల్లల ఎత్తు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

దొనకొండ: గర్భిణులు, బాలింతలు తక్కువ ఖరీదు ఆహార పదార్థాల్లో ఎక్కువ పోషకాలు ఉంటాయని, రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, పప్పులు, శనగలు, ఉలవలు, మునగాకు, గుడ్డు, పాలు వాడటంతో ఆరోగ్యం బాగుంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి తెలిపారు. మండలంలోని పోలేపల్లి పంచాయతీ పరిధి కందులవారిపల్లిలో గురువారం పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఏఎన్‌ఎం సంతోషి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకుంటే పిల్లలకు పెరుగుదల ఉంటుందని, వ్యాధి నిరోధక టీకాల గురించి తెలియజేశారు. అనంతరం చిన్నారుల బరువు, ఎత్తు పరిశీలించి నమోదు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, నాగమణి, శారమ్మ, ఆయా శైలజ తల్లిదండ్రులు, గర్భిణులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

తాళ్లూరు (దర్శి): మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి వైద్యుల సూచనల మేరకు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ సీహెచ్ భారతి తెలిపారు. మండలంలోని బొద్దికూరపాడు ప్రభుత్వ పాఠశాల వద్ద గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, బాలకిశోరాలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే బాలికలకు యుక్త వయసులో వచ్చే సమస్యలను అధిగమించవచ్చన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కె.యుగకీర్తి, హెచ్‌ఎం సుబ్బారావు, ఉప సర్పంచ్ పులి ప్రసాదరెడ్డి, సిబ్బంది జ్యోతి, మరియమ్మ, సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి రైతులు తెగుళ్లతో అప్రమత్తంగా ఉండాలి


ఈ-క్రాప్ చేయిస్తున్న ఏఓ ఫరూక్

ముండ్లమూరు (దర్శి): వరి సాగు చేసిన రైతులు ఉల్లికోడు తెగులుపై అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ తెలిపారు. మండలంలోని శింగనపాలెం గురువారం రైతులు సాగు చేసిన వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 రోజుల వరి పైరును ఉల్లికోడు తెగులు ఆశించినట్లు తెలిపారు. దాని నివారణకు పిప్రొనిల్ గుళికలు 0.3జీ ఎకరానికి పది కేజీలు లేదా రీజెంట్ 0.6 జీ గుళికలు ఎకరానికి నాలుగు కేజీలు చొప్పున ఇసుకలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ దశలో ఉల్లికోడు తెగులును నివారించకుంటే దిగుబడి తగ్గుతుందని తెలిపారు. అనంతరం మెట్ట పొలాలను పరిశీలించి ఖరీఫ్‌లో సాగు చేసిన పంటను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు బాలవెంకటయ్య, ఐసీఆర్పీ చంద్రలీల, రైతులు పాల్గొన్నారు.

దేశ రాజకీయాలకు ఏచూరి మరణం తీరని లోటు


సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

దర్శి: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరనిలోటని ఆ పార్టీ దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో గురువారం సాయంత్రం ఆయన చిత్రపటానికి పూలమాల వేసినివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ సీతారం ఏచూరి విద్యార్థి దశ నుంచే వామపక్ష సంఘాల్లో చురుగ్గా పని చేశారన్నారు. ఢిల్లీ ఏజెన్‌యూలో ఎకనామిక్స్ గోల్డ్ మెడలిస్టని పేర్కొన్నారు. రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికై ప్రజల సమస్యలు ప్రభుత్వ రంగం ప్రాధాన్యం, రాజ్యాంగ విధానాలు తదితర సమస్యలపై పార్లమెంట్‌లో ఆయన ప్రసంగాలకు ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు అందుకున్నారని గుర్తుచేశారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. నాయకులు గోగు వెంకయ్య, సందు వెంకటేశ్వరరావు, ఈమని నాగేశ్వరరావు, ఉప్పు నారాయణ, కేవీ పిచ్చయ్య, రంగనాయకులు, అంజిబాబు, రామకోటిరెడ్డి, షేక్ కాలేబాషా పాల్గొన్నారు.